**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 178 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 5 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# తెలంగాణకు బీసీయే గ్యారంటీగా ముఖ్యమంత్రి అవుతాడు

## ఖర్గే, రాహుల్ ఇచ్చిన ధైర్యంతోనే ఈ మాట చెబుతున్నా : టిపిసిసి చీఫ్



**బీసీల కు హక్కులను అవసరమైతే వాడుకుంటాం**

**మోదీ, అమిత్ షా దగ్గరికి వెళ్ళి చెప్పే దమ్ము, ధైర్యం బిజెపి దద్దమ్మలకు లేదు.**

**శంషాబాద్ ఓబీసీ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

తెలంగాణకు బీసీయే గ్యారంటీగా ముఖ్యమంత్రి అవుతాడని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీసీలకు రావాల్సిన వాటా తీసుకుంటామని అవసరమైతే లాక్కుంటామని వ్యాఖ్యానించారు. బీసీలది న్యాయమైన కోరిక అని అన్నారు. బీసీలకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అండగా ఉంటారని చెప్పారు. శంషాబాద్‌లో ఆదివారం నిర్వహించిన టీపీసీసీ ఓబీసీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కుల కోసం మాట్లాడే ధైర్యం రాహుల్ గాంధీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రి అవుతాడని ఘంటాపదంగా చెబుతున్నా. రాహుల్ గాంధీ, ఖర్గే ఇచ్చిన ధైర్యంతో బీసీ ముఖ్యమంత్రి అవుతాడని చెబుతున్నా. రాహుల్ భారత్ జోడో యాత్రతో ఎవరు ఎంతో వారికి అంత రాహుల్ గాంధీ నినాదం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 55 శాతానికి పైగా సర్పంచ్లను చేశాం. మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం బీసీలకు సీట్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. మంత్రివర్గంలో, ఎమ్మెల్సీల్లో, కార్పొరేషన్లలో బీసీల సంఖ్యను పెంచుతాం. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్క, మంత్రుల సహకారంతో కుల సర్వే నిర్వహించి డాక్యుమెంట్ ఇచ్చాం.

**బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలు**

బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలు. మోదీ, అమిత్ షా దగ్గరికి వెళ్ళి చెప్పే దమ్ము, ధైర్యం దద్దమ్మలకు లేదు. లికేంద్రానికి కనువిప్పు కావాలి. మోదీ గద్దె దిగే టైం వచ్చింది. అధికారం లోకి రాగానే కుల సర్వేహుల్ ,ప్రధాని కావడం తథ్యం కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కుల సర్వే నిర్వహిస్తాం. కులాలను పక్కనపెట్టి బీసీలు ఏకం కావాలి. పోరాడితే పోయేదేమీ లేదు. భవిష్యత్ తరాల కోసం పోరాటం చేయాల్సిన అవసరం. న్యాయమైన కోరిక మనది. మన వాటా మనకు వచ్చే వరకు పోరాడాలి అని మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.




### సీనియర్ సిటిజన్లకు

# ఉచిత బస్ పాసులు!

## విధి విధానాలపై కసరత్తు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం : మంత్రి పొన్నం వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వయోవృద్ధులకు కూడా వర్తింపజేసే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలతో పాటు పురుషులతో సహా వయోవృద్ధులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే వృద్ధులు ఆసుపత్రులు, పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు సులువుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.అయితే, ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, వయో పరిమితి, ఆదాయ పరిమితులు వంటి అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి మార్గదర్శకాలను ఖరారు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధుల జనాభా గణనీయంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 32.69 లక్షలుగా ఉన్న వీరి సంఖ్య, ఇప్పుడు సుమారు 48 లక్షలకు (12.5 శాతం) చేరినట్లు అంచనా.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల సంక్షేమానికి చేయూత పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే టీజీఎస్‌ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, సీనియర్ సిటిజన్ల ఉచిత ప్రయాణంతో పడే అదనపు భారం, దానిని భర్తీ చేసే మార్గాలపై ప్రభుత్వం సమీక్ష జరుపుతోంది. అన్ని అంశాలను పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు ఉచ్చు

## పాత కేసులు తిరగతోడుతున్నకేరళ...

## 2006 నాటి అవినీతి వ్యవహారంపై విచారణకు ఆదేశం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు సంబంధించిన 20 ఏళ్ల నాటి పాత కేసు ఒక్కసారిగా తెరపైకి వచ్చింది. ఎస్ఐఆర్, ఎన్నికల రిగ్గింగ్ ఆరోపణల నేపథ్యంలో, కేరళం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వివాదాస్పద ఆత్మహత్య, అవినీతి కేసుపై విచారణకు ఆదేశించడం రాజకీయంగా కలకలం రేపుతోంది. 2006లో కేరళం ప్రజా పనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా జ్ఞానేష్ కుమార్ పనిచేసినప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ప్రపంచ బ్యాంకు నిధులతో సుమారు రూ.215 కోట్లతో కేరళం రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ కింద ఎంసీ రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను తీసుకున్న మలేషియా కంపెనీకి చెందిన సివిల్ ఇంజినీర్ లిజ్జీ బీన్, రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతిపై పలు ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత ఆమె మలేషియాకు వెళ్లి ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కేపీసీసీ నాయకుడు మలయింకీళు వేణుగోపాల్ శనివారం చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ మరోసారి తెరపైకి వచ్చింది. కేరళం ..మిగతా 2లో



### నేవీ అధికారి

# హనీట్రాప్

## పాకిస్థాన్‌కు సీక్రెట్లు చేరవేస్తున్న నావికుడి అరెస్ట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

భారత రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నాడనే ఆరోపణలపై ఇండియన్ నేవీ చెందిన ఒక నావికుడు అరెస్టయ్యారు. ఇతడిని తమిళనాడులోని కోయంబత్తూర్‌లో అరెస్ట్ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సిఐ) విభాగం వెల్లడించింది. ఈ గూఢచర్య ఆపరేషన్‌లో సోషల్ మీడియా 'హనీ ట్రాప్'ను ఉపయోగించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బంగాల్‌కు చెందిన ..మిగతా 2లో



### ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో

# కీలక ముందడుగు

## ఎస్ఎల్‌బీసీ పనులు 2028 నాటికి పూర్తి

## షియర్‌జోన్ దాటిన తవ్వకాలు

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన టన్నెల్‌లో ఇప్పటి వరకు 79 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదకరమైన షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గత ఐదు నుంచి ఆరు నెలల్లో సుమారు ..మిగతా 2లో



### పైఓవర్ల స్థానంలో

# ఒకే కారిడార్!

కేబీఆర్ పార్క్ చుట్టూ మౌలిక సదుపాయాల ప్రణాళికలో మార్పు

బహుళ పైఓవర్ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం

పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కారిడార్

కొత్త ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ

2లో..



### ఫ్లై దుబాయ్ కోపైలట్

# వాంగ్మూలం

ఫ్లై దుబాయ్ విమానాన్ని...

కూల్చేయాలనుకున్నా

విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ

2లో..

### రూ.400 కోట్లతో అమూల్

# అత్యాధునిక డెయిరీ ప్లాంట్

## తెలంగాణలో తూప్రాన్ డెయిరీ ప్లాంట్‌కు నాంది

## 18 నెలల్లో నిర్మాణం పూర్తి.. రైతులకు అదనపు ఆదాయం

## మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు..కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**తూప్రాన్ అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి శివారులో న సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు ..మిగతా 2లో



# రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్

**మొదటి పేజీ తరువాయి...**

చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు.




### రైతు ఉత్పత్తులకు విలువ జోడింపే లక్ష్యం

రైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేక పోతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. తూప్రాన్ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేయడంతోపాటు పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాలకు విలువ జోడింపుతో రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.
వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు.

### సహకారంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట

రైతులంతా విడివిడిగా కాకుండా సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగవచ్చని కిషన్‌రెడ్డి అన్నారు. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో అవి నిర్వీర్యమయ్యాయని, వాటిని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులే సహకార వ్యవస్థలో భాగస్వాములైతే దళారుల దోపిడీ, అవినీతి, రాజకీయ నాయకుల పెత్తనం తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. సహకార సంఘాల ద్వారా వచ్చే ఆదాయం గ్రామాల్లోనే వినియోగమై స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని వివరించారు.
సహకార ఉద్యమం కేవలం వ్యాపార నమూనా కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ సహకార వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

### అమూల్ విజయమే రైతుల విజయం

సహకార వ్యవస్థతో ఎలాంటి మార్పు సాధ్యమో సాబర్ డెయిరీ ప్రయాణమే నిదర్శనమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1964లో 19 సహకార సంఘాలతో రోజుకు 5,100 లీటర్ల పాల సేకరణతో ప్రారంభమైన సాబర్ డెయిరీ నేడు రోజుకు సుమారు 50 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ స్థాయికి చేరిందన్నారు. సుమారు 50 వేల మంది పాల ఉత్పత్తిదారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారని, 2025–26లో రూ.10,500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించిందని తెలిపారు. అమూల్ సహకార నెట్‌వర్క్ ద్వారా ఏటా సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల దాణాను రైతులకు అందిస్తున్నారని, పశువైద్య సేవలను రైతుల ఇళ్ల వద్దకే తీసుకెళ్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా అమూల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, 50కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు.



# ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం):**

బీసి రాజ్యాధికారం పాదయాత్రలో భాగంగా గద్వాలకు విచ్చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను ఆదివారం నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఎన్ టి ఎస్ ఎఫ్, టి టి యు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్నూల్ ప్రైవేటు ఆసుపత్రులలో నడిగడ్డ ప్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ సౌకర్యం కల్పించి మెరుగైన వైద్యం అందేలా శాసనమండలి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షులు పాల్వాయి లక్ష్మీనారాయణ, టి టి యు జిల్లా అధ్యక్షులు బుచ్చన్న, ఎన్ టి ఎస్ ఎఫ్ ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్, రాజు సాగర్, నర్సింహుల గౌడ్, నర్సింహులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు

## ఫ్లైఓవర్ల స్థానంలో

# ఒకే కారిడార్!

**కేబీఆర్ పార్క్ చుట్టూ మౌలిక సదుపాయాల ప్రణాళికలో మార్పు**
**బహుళ ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం**
**పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కారిడార్**
**కొత్త ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ**
**ఐటీ కారిడార్ వైపు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కల్పించడమే లక్ష్యం**

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలనుకున్న హెచ్–సిటి (హైదరాబాద్ క్రియేటివ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్) ఇన్‌ఫ్రా ప్రాజెక్టులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీలక మార్పులు చేసింది. గతంలో ప్రతిపాదించిన పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని

**మొదటి పేజీ తరువాయి...**

నిర్ణయించింది. పంజాగుట్ట–బంజారాహిల్స్ నుంచి జూబ్లీహిల్స్ వైపు రవాణా సౌకర్యాన్ని మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది.

ఈ సవరించిన ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కొత్త డిజైన్లు, వ్యయ అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను కమిటీ ఆదేశించింది.

కొత్త ప్రణాళిక ఇదే..

తాజా ప్రతిపాదన ప్రకారం, పంజాగుట్ట సమీపంలోని ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతం వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీని ద్వారా జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ–మాదాపూర్ ఐటీ కారిడార్ వైపు వాహనదారులు ఎలాంటి సిగ్నల్స్ లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.

ప్రణాళిక మార్పునకు కారణాలు

కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్–సిటి ప్రాజెక్టులో ఇది ఒక ప్రధానమైన మార్పు. గతంలో పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్ల వద్ద జీహెచ్ఎంసీ పలు స్టీల్ ఫ్లైఓవర్లు, డైరెక్షనల్ అండర్‌పాస్‌లను నిర్మించాలని ప్లాన్ చేసింది. ప్యాకేజీ ×, ×× కింద అంచనా వ్యయం మొదట రూ. 826 కోట్లు కాగా, తర్వాత అది రూ. 1,090 కోట్లకు పెరిగింది.

అయితే, ఈ ఏడాది ఆగస్టులో కేబీఆర్ పార్క్ చుట్టూ క్లాక్‌వైజ్ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. నిర్మాణ పనుల కోసం తాత్కాలికంగా మొదలుపెట్టిన ఈ విధానం వల్ల ట్రాఫిక్ కదలికలు మెరుగుపడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో, తొలుత ప్రతిపాదించిన అన్ని గ్రేడ్ సెపరేటర్లు అవసరమా అనే దానిపై పునరాలోచనలో పడ్డారు.

దీనికి తోడు, పాత ప్రాజెక్టుకు పర్యావరణ, న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురయ్యాయి. కేబీఆర్ పార్క్ ఎకో–సెన్సిటివ్ జోన్ పరిధిలో చెట్ల నరికివేత, తరలింపుపై స్టే రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ తన ప్రణాళికను సవరించింది.

ప్రస్తుతానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపినప్పటికీ, ఇది తుది నిర్మాణ ప్రణాళిక కాదు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి ఇంజనీరింగ్ డిజైన్లు, సవరించిన వ్యయ అంచనాలు ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. అనంతరం ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపి, ఈపీసీ కమిటీ, జీహెచ్ఎంసీ జనరల్ బాడీ ముందు ఉంచుతారు. ఈ మార్పులతో హైదరాబాద్‌లోని అతిపెద్ద రోడ్డు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులలో ఒకటైన హెచ్–సిటి స్వరూపం గణనీయంగా మారనుంది.




# తీన్మార్ మల్లన్న బ్లాక్‌మెయిల్ రాజకీయాలను మానాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు**
**బీసీ నాయకులను లక్ష్యంగా చేసుకుని రాజకీయ లబ్ధి పొందడం దుర్మార్గం**
**జనరల్ స్థానంలోనూ బీసీలకు పదవులు ఇచ్చి ప్రోత్సహించిన ఘనత ఎంపీ డీకే అరుణకు దక్కుతుంది**
**బీసీల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకటరాములు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4(ప్రభాత ఉదయం)**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసేవి సేవారాహిత్య, ఊసరవెల్లి మరియు బ్లాక్‌మెయిల్ రాజకీయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ధ్వజమెత్తారు. ఆదివారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ, “పార్టీలు మారడంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది అని అన్నారు. క్యూ న్యూస్ పేరుతో తప్పుడు కథనాలు వేస్తామని బెదిరించి బోధన్‌లో గౌడ కులస్తుల నుండి డబ్బులు వసూలు చేసిన ఘటనలో కేసులు నమోదైన విషయం, అలాగే చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులను రూ.30 లక్షలు డిమాండ్ చేసి చంచల్‌గూడ జైలుకు వెళ్లిన చరిత్ర మల్లన్నది” అని ఎద్దేవా చేశారు. విజయ్ కుమార్ యాదవ్ వంటి అనేకమంది బీసీ నాయకులను లక్ష్యంగా చేసుకుని రాజకీయంగా దెబ్బతీయడానికి మల్లన్న కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రతిష్టను భంగపరచే స్థాయి మల్లన్నకు లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో గద్వాల మున్సిపల్ చైర్మన్ స్థానం ‘జనరల్’ అయినప్పటికీ, బీసీ వర్గానికి చెందిన నాయకులకే ఆ అవకాశం కల్పించిన ఘనత డీకే అరుణకు దక్కిందని గుర్తుచేశారు. నేడు గద్వాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నది కూడా ఒక బీసీ నేత అని, అనేక గ్రామాలు, మండలాల్లో ఎంతోమంది బీసీ నాయకులకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పదవులు కల్పించి ప్రోత్సహించిన చరిత్ర ఎంపీ డీకె అరుణకు ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకటరాములు, జిల్లా కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న, కౌన్సిలర్ చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అనిల్, సీనియర్ నాయకుడు రజక నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగాలే శ్రేయస్కరం కావు

**నిరుద్యోగులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం):**

రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది నిరుద్యోగుల సమస్యలకు కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే పూర్తి పరిష్కారాన్ని చూపలేవని, నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా వ్యాపారవేత్తలు గా ఎదగాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. టీఅర్పీ పార్టీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ మల్లన్న తలపెట్టిన బీసి రాజ్యాదికారం పాదయాత్ర ఆదివారం గద్వాలలో కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులతో సమావేశమయ్యారు. అనేక సంవత్సరాలుగా డిస్ట్రిక్ లైబ్రరీ భవనాన్ని నిర్మిస్తామని పనులు ప్రారంభించి నేటి కూడ పూర్తి చేయలేకపోయారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు ఉన్న లైబ్రరీలో కనీస వసతులు కల్పించడంలేదని, ముఖ్యంగా టాయిలెట్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవికి ఫోన్ చేసి గ్రంథాలయంలో మౌళిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం నిరుద్యోగ యువత , పట్టభద్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని వేల లేదా రెండు లక్షల ఉద్యోగ ప్రకటనలు వచ్చినంత మాత్రాన, 36 లక్షల మంది నిరుద్యోగుల అవసరాలను అవి నెరవేర్చలేవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం పాలనా వ్యవస్థను నడపడానికి రూపొందించిన ఒక ప్రక్రియ మాత్రమే తప్ప, అది పూర్తి జీవితం కాదని అన్నారు. యువత తమ ఆలోచనలను, శ్రమను వ్యాపార రంగం వైపు మళ్లించాలని సూచించారు. 100 మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని, కాలేజీలు, ఆసుపత్రులు , ఇతర వ్యాపార సంస్థలను స్థాపించి ఆర్థిక సాధికారత సాధించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల భవిష్యత్తును మార్చే మార్గదర్శకాలను అందించడానికే తాను ప్రాధాన్యత ఇస్తున్నానని, ప్రజా సమస్యల స్పృహ పెంచి చైతన్యపరచడమే తన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల పరిమితులను గుర్తించి, యువత తమ నైపుణ్యాలతో వ్యాపార రంగాన్ని ఎంచుకుని సమాజంలో ఉపాధి ప్రదాతలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గద్వాల నుంచి వీరాపురం మీదుగా ఎర్రవల్లి మండల కేంద్రానికి పాదయాత్రగా కొనసాగించారు.



# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు

**మొదటి పేజీ తరువాయి...**

700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పనులపై అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. 43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తికాగా మరో 9.1 కిలోమీటర్ల తవ్వకాలు మిగిలి ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో వేగం పెంచాలి

ప్రస్తుతం రోజుకు 7 నుంచి 7.5 మీటర్ల మేర పనులు జరుగుతున్నాయని, అదనపు డ్రిల్లింగ్ బూమర్, ఎలక్ట్రిక్ లోడర్లు, ఆధునిక ఎక్స్‌కవేటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. జర్మనీ నుంచి అక్టోబర్ చివరికి లోకోమోటివ్ రానుందని, దీంతో టన్నెల్‌లో తవ్విన మట్టిని వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో 48 గంటలు పట్టిన నిర్మాణ సైకిల్ ప్రస్తుతం 20--24 గంటలకు తగ్గిందని, దాన్ని సుమారు 10 గంటలకు తగ్గించి పనుల వేగం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మే--జూన్ 2028 నాటికి టన్నెల్–1 బ్రేక్‌త్రూ పూర్తి చేసి జూన్ 2028 నాటికి నీటిని అందించేలా పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనులు కొనసాగించాలని సూచించారు.

# నేవీ అధికారి హనీట్రాప్

**మొదటి పేజీ తరువాయి...**

31 ఏళ్ల ప్రదీప్ ముఖర్జీ 2014లో నౌకాదళంలో చేరారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, కోయంబత్తూరులోని నౌకాదళ లీడర్‌షిప్ ట్రైనింగ్ సెంటర్ ‘ఐఎన్ఎస్ అగ్రణి’లో ఒక వారం రోజులుగా మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కోర్సులో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే రహస్య సమాచారం చేరవేసిన ఆరోపణలతో ముఖర్జీని అక్టోబర్ 3న ఆంధ్రప్రదేశ్ సిఐ సెల్ అధికారులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

# ఫ్లై దుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్–హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో (ఎఠీఖంష్ట్ర ఖఇవ) దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు.ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు ఉచ్చు

**మొదటి పేజీ తరువాయి...**

హోం మంత్రి రమేష్ చెన్నితాల ఈ ఫిర్యాదుపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. సీఎం వి.డి. సతీసన్‌తో చర్చించిన అనంతరం, సమగ్ర విజిలెన్స్ విచారణ జరపాల్సిందిగా విజిలెన్స్ డైరెక్టర్ మనోజ్ అబ్రహాంను హోంశాఖ ఆదేశించింది. ఎస్ ఐ ఆర్ వివాదం, పలు రాష్ట్రాల్లో భారీగా ఓట్ల తొలగింపు, ఈవీఎంలపై ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. సీజేపీ , ప్రతిపక్షాలు దిల్లీలో నిరసనలు చేస్తున్నాయి. ఈ తరుణంలో జ్ఞానేష్ కుమార్ పై 20 ఏళ్ల క్రితం నమోదైన కేసును కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి వచ్చింది. ఈ కేసును విచారించాలని విజిలెన్స్ ను ఆదేశించింది.

# మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

**ఎమ్మెల్సీ మల్లన్నను కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం):**



టీఅర్ పీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తలపెట్టిన బీసీ రాజ్యాధికారం పాదయాత్రలో భాగంగా గద్వాలకు విచ్చేసిన సందర్భంగా ఆదివారం గద్వాలలో మున్నూరు కాపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు. అనంతరం మున్నూరు కాపు ఆర్థిక , రాజకీయ స్థితిగతులపై ఎమ్మెల్సీ చర్చించారు. రాబోయే రోజుల్లో బీసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు.. నాయకి శ్రీనివాస్ రెడ్డి, మున్నూరు జైపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బండి బాలు, కొత్త గణేష్ శ్రీనివాస్ రెడ్డి రైస్ మిల్ అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రాజేంద్రనగర్ లో ఇంద్రారెడ్డి 72వ జయంతి వేడుకలు


పీడీపీ చౌరస్తాలో మాజీ మంత్రి స్వర్గీయ పి ఇంద్రారెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి తదితరులు


ఇంద్రన్న జయంతి వేడుకలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య


గగన్ పహాడ్ వద్ద ఇంద్రన్న చిత్ర పటానికి నివాళులు అర్పించిన పి కార్తీక్ రెడ్డి, శీలం తిరుపతి రెడ్డి లు


కౌకుంట్ల లోని స్వర్గీయ ఇంద్రారెడ్డి సమాధి వద్ద పి కార్తీక్ రెడ్డి తో పాటు కాటేదాన్ డివిజన్ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్


గాంధీ నగర్ లో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ బీ ఆర్ ఎస్ ఉ పాధ్యక్షుడు దుంబాల ఉమా రెడ్డి, పి శ్రీనివాసులు


రాజేంద్రనగర్ అంబేద్కర్ కాలనీ లో ఇంద్రన్న చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పచ్చ శ్రీనివాసులు తదితరులు

**బుద్వేల్, అక్టోబరు 4 (ప్రభాత ఉదయం):**

పేదలు, బలహీన వర్గాల సంక్షేమం యూకోసం విద్యార్థి దశలోనే రాజకీయాల పట్ల ఆకర్షితులై అటు రాష్ట్ర రాజకీయాలలో ఇటు రంగారెడ్డి జిల్లాలో ప్రజా నాయకులుగా పేరు తెచ్చుకున్న గొప్ప నేత స్వర్గీయ పి ఇంద్రారెడ్డి అని ఆయన తనయుడు, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి అన్నారు. స్వర్గీయ పి ఇంద్రారెడ్డి 72వ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పీడీపీ చౌరస్తాలో జరిగిన ఇంద్రన్న జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉ స్మానియా యూనివర్శిటీ లా కాలేజ్ ప్రెసిడెంట్ గా రాజకీయ జీవితం ప్రారంభించిన పి ఇంద్రారెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు గెలిచి కార్మికశాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా, హోంశాఖ మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన పేదల కోసం పరితపించిన నాయకుడన్నారు. రంగారెడ్డి జిల్లాలో అనేక మంది నాయకులను తయారు చేసిన ఘనత ఇంద్రారెడ్డి కి దక్కుతుందన్నారు. జిల్లాలో నేడు ఎక్కడికి వెళ్లినా ఆయన చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తాయని, ఆయన తయారు చేసిన నాయకులు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ కె ఎస్ దయానంద్, కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, నాయకులు జాలిగం చిత్తారి, పి జీవన్ దాస్, ఎడ్లకాడి సూర్యం, నోముల రాము యాదవ్, ఎర్రాళ్ల యాదయ్య, అక్కెం రాఘవేందర్ యాదవ్, వీర్లపల్లి నవీన్ కుమార్, వెం కట్ రెడ్డి, , ఆనంద్ రెడ్డి, వాసు, జగదీశ్, చిరంజీవి, కొత్త రాజశేఖర్ రెడ్డి, నయీమ్, జహీరుద్దీన్, మల్లికార్జున్, సునీల్, సుమన్, పంబాల రాజు, అరుణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గాంధీనగర్ లో...**

గాంధీనగర్ బస్తీలో స్వర్గీయ ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుంబాల ఉమారెడ్డి, పచ్చ శ్రీనివాసులు, పి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ నగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆవరణలో.**

జై తెలంగాణ పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హోంశాఖ మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్న గొప్ప నాయకుడని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి సంఘం అధ్యక్షులు పచ్చ శ్రీనివాసులు అన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ ఉ పాధ్యక్షులు డి ఉమారెడ్డి, స్థానిక నాయకులు ఎస్ పెంటయ్య, పంబాల రాజు, గొడుగు సంజీవ, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

**గగన్ పహాడ్ లో....ఇంద్రారెడ్డికి ఘన నివాళులు..**

మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి 72వ జయంతి వేడుకలను సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం గగన్ పహాడ్ బస్తీలో ఘనంగా నిర్వహించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డితన తండ్రి ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పలువురు పార్టీ నాయకులు,అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని ఇంద్రారెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ...ఇంద్రారెడ్డిపై అభిమానంతో ఎందరో తమ కుటుంబానికి అండగా నిలుస్తున్నారని,వారి ఆదరాభిమానాలతోనే దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు.ఈ ప్రాంత ప్రజలను తమ కుటుంబం మరిచిపోదనీ అన్నారు.జయంతి వేడుకల్లో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య,సదాల వెంకట్ రెడ్డి,నోముల రాముయాదవ్, వల్లూరి నాగేష్,సిహెచ్ సతీష్ యాదవ్,కొంపల్లి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మేయర్ ఆలంపల్లి పోచయ్య మృతి

**హైదరాబాద్, అక్టోబరు 4 (ప్రభాత ఉదయం) :**



హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ ఆలంపల్లి పోచయ్య(80) ఇక లేరు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. పాతనగరం ఛత్రినాక కు చెందిన అల్లంపల్లి పోచయ్య మజ్లీస్ పార్టీ లో కృయాశీలకంగా పని చేసి 1986 లో జంగంమేట్ కార్పొరేటర్ గెలిచారు . 1989 నుంచి 1991 వరకు హైదరాబాద్ మేయర్(ఎంసీహెచ్) గా సేవలం దించారు. అనంతరం సివిల్ సప్లై ,మైన్స్ డైరెక్టర్ గా పని చేసిన ఆయన మజ్లీస్ పార్టీ అధినేత స్వర్గీయ మాజీ ఎంపీ సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఇతర మజ్లీస్ నేతలకు ఆత్మీయుడిగా ఉన్నారు . హైదరాబాద్ అభివృది, పాతనగరం అభివృద్ధి కి ఆయన తన వంతు పాత్ర పోషించారు. పోచయ్య కు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

**సోమవారం అంత్యక్రియలు :**

సోమవారం ఉదయం చాంద్రాయణగుట్ట నల్లవాగు హిందు స్మశాన వాటిక లో అంత్రక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు దారుస్సలాం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ అల్లంపల్లి నరేందర్ తెలిపారు.



బ్రాహ్మణ సోదరులకు కార్డులు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ సేవ వాహిని ప్రతినిధులు

## బ్రాహ్మణుల విద్య, వైద్యం అందించేందుకు సేవక్ కార్డు కార్డ్ దోహదం

**బ్రాహ్మణ సేవా వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమాన్ రఘుకిరణ్ చార్యులు**

**బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో బ్రాహ్మణ సోదరులకు సేవక్ కార్డు పంపిణీ**

**హైదరాబాద్(ప్రభాత ఉదయం), అక్టోబర్ 4ంప్రభాత ఉదయం)**

మెహదీపట్నంలోని ఎల్ఐసి కాలనీ పార్క్‌లో బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో సేవక్ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం గ్రేటర్ అధ్యక్షురాలు బాలా త్రిపుర సుందరి, కిషోర్,రాజేంద్ర నగర్ జోన్ అధ్యక్షులు నందూరి విజయ్ కుమార్ అత్తాపూర్ డివిజన్ మహిళా అధ్యక్షులు లలితా సరస్వతీ,మెహదీపట్నం జోన్ ఇంచార్జ్ కృష్ణ కిషోర్ ల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు బ్రాహ్మణవ సోదరులు హాజరై సేవక్ కార్డు కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రాహ్మణ సేవా వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమాన్ రఘుకిరణ్ చార్యులు శేషం సేవక్ కార్డు ద్వారా అందుబాటులో ఉ ండే వివిధ సేవలు, ప్రయోజనాల గురించి సవివరంగా వివరించారు.బ్రాహ్మణ కుటుంబాలకు సేవా కార్యక్రమాలు, అత్యవసర సహాయం, విద్యా , ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సంబంధిత సహకారం, సంక్షేమ పథకాల సమాచారం తదితర అంశాల్లో సేవక్ కార్డు ద్వారా అందించే సహాయంపై ఆయన వివరించారు.

"అనేక సేవలు,ప్రయోజనాలతో కూడిన సేవక్ కార్డు పొందడం ఎంతో సంతోషంగా ఉంది. బ్రాహ్మణ సమాజానికి ఇది ఉపయోగకరమైన కార్యక్రమం" అని కార్యక్రమానికి హాజరైన పలువురు బ్రాహ్మణ సోదరులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సేవక్ కార్డు ఇంచార్జ్ హరి ఆంజనేయ అభిషేక్ శర్మ, కార్యనిర్వహణ కార్యదర్శి శేషం శ్రీకర్, ప్రచార కార్యదర్శి నందూరి పవన్, గ్రేటర్ సహాయ కార్యదర్శి లంకా రాజశేఖర్, మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో బ్రాహ్మణ కుటుంబాలకు సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు సేవక్ కార్డు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## ఆరోగ్యందేవుడెరుగు... తట్టుకొని పడితే తప్పదు ఆస్పత్రికి పరుగు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం):**

ఆహార అలవాట్లు, పని ఒత్తిడి కారణంగా ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసేందుకు ప్రస్తుతం ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిలో భాగంగా దగ్గరలోని ఓపెన్ జిమ్ లను ఆశ్రయిస్తున్నారు. కానీ, ప్రస్తుతం ఓపెన్ జిమ్ ల పరిస్థితి చూస్తుంటే ఆరోగ్యం దేవుడెరుగు... తట్టుకొని పడితే మాత్రం తప్పదు ఆస్పత్రికి పరుగు అన్నట్టుగా దర్శనమిస్తున్నాయి. నిర్వహణను పట్టించుకోక అధ్వాన్నంగా మారుతున్నాయి. ఎక్కడి దాకో ఎందుకు.. రామగుండం నగర పాలక కార్యాలయం ఆవరణలోని ఓపెన్ జిమ్ ఒక్కటే అందుకు దృష్టాంతంగా చెప్పుకోవచ్చు. ఇక్కడి ఓపెన్ జిమ్ లో కింద పరిచిన రబ్బర్ టైల్స్ ఎక్కడిక్కడ చిందరవందరగా లేచి ఉండటం, పరికరాలు తుప్పు పట్టి వ్యాయామానికి ప్రతికూలంగా ఉన్నా పట్టించుకునే దిక్కు లేదు.ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నగరంలోని పలు చోట్ల బహిరంగ వ్యాయామ శాలలు (ఓపెన్ జిమ్)లను ఏర్పాటు చేసింది. ఆ జిమ్ ల నిర్వహణ బాధ్యతలను మున్సిపల్ అధికారులకు అప్పగించింది. కానీ, కొంత కాలంగా మున్సిపల్ అధికారులు వాటి నిర్వహణను అంతగా పట్టించుకోవడం లేదు. దీనితో కొన్ని చోట్ల పరికరాలు పనికి రాకుండా పోతుండగా, కింద పరిచిన రబ్బర్ టైల్స్ లేచి ఉండటంతో వ్యాయామం చేయలేని పరిస్థితి ఉంది. వ్యాయామంకు వచ్చే వృద్ధులు తొందరపాటులో తట్టుకొని కింద పడుతున్నారు. అధికారులు బాగు చేయించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిర్వహణ మూన్నాళ్ల ముచ్చటగా మారిందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఓపెన్ జిమ్ ల ను బాగు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద శ్రమదానం చేస్తున్న బీజేపీ నాయకులు.. శ్రమదానం చేస్తున్న నాయకులు

## చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద శ్రమదానం చేసిన బీజేపీ నాయకులు

**బుద్వేల్, అక్టోబరు 4 (ప్రభాత ఉదయం)**

చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట పరిసరాలలో ఆదివారం బీజేపీ నాయకులు, స్థానిక భక్తులు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. హస్తాల వీరన్న గుట్ట దేవాలయం పరిసరాలను శుభ్రం చేశారు. దేవాలయానికి వెళ్లే రహదారిని బాగు చేశారు. బీజేపీ గోల్కొం డ గోషామహాల్ జిల్లా కన్వీనర్ వై.శ్రీధర్, వనపర్తి నియోజకవర్గం ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు జి బాబురావు ల ఆధ్వర్యంలో దేవాలయం ప్రాంగణంలో వంటా వార్పు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. శ్రమదానంలో నాయకులు వెంకటేశ్, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సందీప్, మహేశ్, శ్రీను, క్రిష్ణాగౌడ్, అమర్, వేణు, పవన్, నరేందర్, ఉ పేందర్, మనోజ్, ప్రవీణ్, సాయి, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

**నేడు అభిషేకాలు :**

ఈ నెల 5వ తేదీన హస్తాల వీరన్న దేవాలయం లో స్వామీ వారికి ఉదయం 8 గంటల నుంచి 10 గం టల వరకు అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వై. శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి లు తెలి పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలి : స్థానికులు**

పేదల దేవుడు శివుడు అని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చింతల్ మెట్ హస్తాల వీరన్న దేవాలయాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దేవదాయ శాఖ రికార్డులను బట్టి హస్తాల వీరన్న దేవాలయానికి నాలుగు ఎకరాల భూమి ఉందని అధికారులు చెబుతున్నారన్నారు. నాలుగు ఎకరాలలో వెలసిన అక్రమణలను తొలగించి హస్తాల వీరన్న దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు.



## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వేధింపులు.. సర్పంచ్ ఆత్మహత్యాయత్నం!

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం):**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండయ్యపల్లి సర్పంచ్ మల్యాల తిరుపతి అలియాస్ వినయ్ సాగర్ ఆత్మహత్యకు యత్నినంచారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గంగాధర మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు తనను అవమానాలకు గురిచేస్తున్నారని, తనపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం మధురానగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద క్రిమిసంహార మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అడ్డుకుని ఆయనను ప్రైవేటు వాహనంలో కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు.ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. గంజాయి కేసు పెడతానంటూ బెదిరిస్తున్నారని, గంగాధర పోలీసులు ఫోన్ చేసి కేసు నమోదైందని, నోటీసులు తీసుకోవాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంగాధర మండల సర్పంచుల వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు తనను అవమానకరంగా మాట్లాడుతున్నారని తిరుపతి ఆరోపించారు. తన ఆత్మహత్యాయత్నానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గంగాధర మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.-

# సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

**పంటలను కాపాడేందుకు చివరి తడికి నీటి విడుదలన్నిమంత్రి తుమ్మల వెల్లడి**

**లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు విద్యుత్ సరఫరా**

**రైతులు ఆందోళన చెందొద్దు..న్నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి**

**సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక చర్యలు**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం)**




తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు చివరి తడికి నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు విడుదల చేస్తున్నామని చెప్పారు. పంటలు ఎండిపోకుండా అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సాగర్ ఆయకట్టుతోపాటు అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు కూడా అదనంగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

**ఆయకట్టు, ప్రాజెక్టులకు నీరు..**

పినపాక నియోజకవర్గంలోని తుమ్మల చెరువు ఆయకట్టుకు, అలాగే వైరా ప్రాజెక్టు, వెంగళరాయసాగర్ ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టు, లంకాసాగర్ ప్రాజెక్టులకు కూడా గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆయా ప్రాజెక్టులు, చెరువుల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించి సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**లిఫ్ట్‌లకు విద్యుత్ సరఫరా..**

పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను వినియోగించుకుంటున్నామని తుమ్మల తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు కూడా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. లిఫ్ట్‌ల ద్వారా అందుబాటులో ఉ న్న నీటిని పొలాలకు అందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**సీఎం ఆదేశాలతో ప్రత్యేక చర్యలు..**

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేసిన పంటలను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటల పరిరక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**నీటిని వృథా చేయొద్దు...**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదావరి జలాలను రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే మరింత విస్తీర్ణంలోని పంటలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే వేసిన పంటలకు చివరి తడి అందించడమే లక్ష్యంగా నీటి విడుదల చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. సాగర్ ఆయకట్టుతోపాటు పినపాక నియోజకవర్గంలోని తుమ్మల చెరువు ఆయకట్టు, వైరా, వెంగలరాయ సాగర్, సింగభూపాలెం, లంకాసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు నీటి విడుదలతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు విద్యుత్ సరఫరా చేసి అన్ని విధాలుగా సహకరిస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# తల్లిపాలతోనే శిశువులకు ఆరోగ్యకర భవిష్యత్తు

## యశోద హైటెక్ సిటీలో ముగిసిన లింబ్కన్ 2026 'యశోదమ్మ మదర్స్ మిల్క్ బ్యాంక్' ప్రారంభం

## 1,000 మందికి పైగా వైద్య నిపుణుల భాగస్వామ్యం.. 'ఫార్ములా-ఫ్రీ హైదరాబాద్'కు డెక్కన్ డిక్లరేషన్

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 4,(ప్రభాత ఉదయం)**

తల్లిపాలు శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. అవసరమైన నవజాత శిశువులకు సురక్షితమైన దాతృత్వ తల్లి పాలను అందించేందుకు మదర్స్ మిల్క్ బ్యాంకుల ఏర్పాటు సమాజానికి ఎంతో ఉపయోగకరమైన సేవ అని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో అక్టోబర్ 2 నుంచి 4 వరకు నిర్వహించిన 6వ లింబ్కన్ 2026 అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. యునిసెఫ్ సౌత్ ఏషియా చాప్టర్ ఆధ్వర్యంలో సుషేన హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన 1,000 మందికి పైగా వైద్యులు, నర్సులు, తల్లిపాల నిపుణులు, పోషకాహార, ప్రజారోగ్య నిపుణులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో 'యశోదమ్మ మదర్స్ మిల్క్ బ్యాంక్'ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ గోరంటి రవీందర్ రావు మాట్లాడుతూ తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణకు తమ సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అవసరమైన శిశువులకు సురక్షితమైన తల్లి పాలను అందించేందుకు మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు.


యశోదమ్మ మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ మాజీ కేంద్రమంత్రి తోపాటు పలువురు వైద్యులు..

**'ఫార్ములా-ఫ్రీ హైదరాబాద్'కు డెక్కన్ డిక్లరేషన్**

సదస్సులో హైదరాబాద్‌ను 'ఫార్ములా-ఫ్రీ నగరం'గా తీర్చిదిద్దే లక్ష్యంతో డెక్కన్ డిక్లరేషన్‌ను ఆవిష్కరించారు. ప్రతి ప్రసవ కేంద్రంలో తల్లిపాల సలహాదారులను అందుబాటులో ఉంచడం, నవజాత శిశు విభాగాల్లో మదర్స్ మిల్క్ బ్యాంకులు ఏర్పాటు చేయడం, పనిచేసే తల్లులకు కార్యాలయాల్లో సహకారం అందించడం, బహిరంగ ప్రదేశాల్లో తల్లిపాలు ఇచ్చేందుకు అనుకూల వసతులు కల్పించడం వంటి అంశాలను ఇందులో చేర్చారు. మాజీ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అశ్విని కుమార్ చౌబే ఈ కార్యక్రమాన్ని చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో కీలక చర్యగా అభివర్ణించారు. తల్లి పాల బ్యాంకింగ్ ద్వారా నవజాత శిశు సంరక్షణలో మార్పు" అనే ఇతివృత్తంతో సదస్సులో శాస్త్రీయ సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో 13కి పైగా శిక్షణా కార్యక్రమాలు జరగగా, యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో 'తల్లిపాలు ఇవ్వడంలో ప్రత్యేక పరిస్థితులు' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 650 మందికి పైగా నమోదు చేసుకున్నారు. న్యూ డిల్లీకో చెందిన ఎమ్స్, చండీగడ్ కు చెందిన పీజీమర్, యునిసెఫ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

**దేశవ్యాప్తంగా మరిన్ని మిల్క్ బ్యాంకులు అవసరం**

సుషేన హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డా. సంతోష్ కుమార్ క్రాలేటి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 1,000 ఆసుపత్రుల్లో మదర్స్ మిల్క్ బ్యాంకులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో 65 నుండి 70 వరకు మాత్రమే తల్లి పాల బ్యాంకులు ఉన్నాయని తెలిపారు. సుషేన హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ సహకారంతో హైదరాబాద్‌లో ఇప్పటికే 10కి పైగా మదర్స్ మిల్క్ బ్యాంకులు ఏర్పాటు కాగా, యశోద హైటెక్ సిటీలో ప్రారంభమైన 'యశోదమ్మ మదర్స్ మిల్క్ బ్యాంక్' 11వ బ్యాంక్‌గా నిలిచిందన్నారు. కేంద్రంలో పనిచేసే నర్సులకు ప్రత్యేక శిక్షణతో పాటు, ఉత్తమ వైద్య విధానాల ఆధారంగా మార్గదర్శకాలు, ప్రామాణిక నిర్వహణ విధానాలను రూపొందించారు. యునిసెఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక చీఫ్ జెలాలెం టాఫెస్సే తల్లిపాలను తక్కువ వ్యయంతో అత్యంత ప్రభావవంతమైన ఆరోగ్య చర్యల్లో ఒకటిగా అభివర్ణించారు.

# భరత్ నగర్ కాలనీలో సంక్షేమ సంఘం పాదయాత్ర

## ఈడబ్ల్యూఎస్ మొదటి విడతలో స్థానిక సమస్యల పరిశీలన - పాల్గొన్న సంఘం సభ్యులు

**కూకట్ పల్లి, అక్టోబర్ 4( ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గంలోని భరత్ నగర్ కాలనీలో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్ లో ఉన్న స్థానిక సమస్యలను పరిశీలించేందుకు ఈ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఉన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వైద్యులు పి. నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు, బాబు, నరేష్ కుమార్, రత్నారావు, వెంకటేష్ యాదవ్, బుచ్చిబాబు, డేవిడ్, బిక్షపతి గౌడ్, సత్యనారాయణ, రాంబాబు, శ్రీనివాస్, సంతోష్ కుమార్, నాగరాజు, వెంకట్, లక్ష్మీ, నాయుడు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన కోసం బీసీ గర్జన సభ

## ఆల్విన్ కాలనీ డివిజన్ నుంచి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు - పాల్గొన్న పట్వారి శశిధర్

**కూకట్ పల్లి, అక్టోబర్ 4(ప్రభాత ఉదయం)**




జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని కోరుతూ నిర్వహించిన భారీ బహిరంగ సభ బీసీ గర్జన సభలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు బీసీ సోదరులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్వారి శశిధర్ మాట్లాడుతూ బీసీల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా గుర్తించేందుకు ఓబీసీ కులగణన అవసరమనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని , జాతీయ జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని అన్నారు, బీసీ కులగణన చేపట్టకుండా బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీగా మిగిలిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పాముల పాత్ర జీవవైవిధ్య పరిరక్షణకు కీలకమే

## మూఢనమ్మకాలతో పాములను చంపొద్దు: క్యూరేటర్ జె.వసంత

**హైదరాబాద్(బహదూర్ పుర)**

నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్ లో 72వ వన్యప్రాణి వారోత్సవాల ఆసక్తికరంగా కొనసాగాయి. జూలోని సరిస్రుపాల జగత్తు యాంఫీ థియేటర్‌లో పాముల పై అవగాహన, ప్రదర్శన తో పాటు ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహించారు. జెడ్ఈఓ సి.హెచ్. దీపక్ తరుణ్ జీవవైవిధ్యంలో పాముల పాత్ర వివరించారు. సర్పజాతి వాస్తవాలు, వాటిపై అపోహల ఆయన నివృత్తం చేశారు. పాములలో విషపూరితమైనవి, విషరహితమైనవి రెండు రకాలు ఉంటాయని ప్రత్యక్షంగా చూపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. విషపూరిత పాములలో రాజనాగు, కళ్లజోడు నాగు, వైపర్లు, కట్లపాములు కాగా, ప్రకృతిలో చాలా పాములు విషరహితమైనవి కావడంతో పాటు రైతులకు స్నేహితులుగా చెప్పారు. వాటిలో ఎలుకల పాము (రాట్ స్నేక్), ఇసుక బొద్దింక (శాండ్ బోవా), పచ్చ తీగ పాము (గ్రీన్ వైన్ స్నేక్) వంటి పాములు ఎలుకలు, బల్లులు, కప్పలు, కీటకాలు, చిన్న క్షీరదాలను ఆహారంగా తీసుకొని రైతులకు ఇటువంటికంగా మేలు చేస్తాయని వివరించారు. సుమారు 5000 మంది సందర్శకులు స్నేక్ ఎవర్నెస్ ప్రోగ్రాం లో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ జె. వసంత, ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ ప్రకృతిలోని ప్రతి జీవి జీవవైవిధ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రకృతిలో పాములు కూడా చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, అయితే అనేక అపోహలు, మూఢనమ్మకాలు, తప్పుడు విశ్వాసాలే వాటిని చంపడానికి ప్రధాన కారణమని ఆమె తెలిపారు. పాము కాటు గురైన వెంటనే తీసుకోవలసిన ముందుజాగ్రత్త చర్యలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్- 3 బి. లక్ష్మణ్, ఎఫ్ఎస్ఓ కె. వెంకట రావు, పిఆర్ఓ హెచ్.ఎం. హనీఫుల్లా తదితరులు పాల్గొన్నారు .



# దివిటీపల్లిని ఊహించని రీతిలో అభివృద్ధి చేస్తాం

## రూ.50 లక్షలతో నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 4(ప్రభాత ఉదయం)అక్టోబర్ 4, ప్రభాత ఉదయం**

దివిటీపల్లిని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని దూటిపల్లిలో రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ఉన్నప్పటికీ దివిటీపల్లి ప్రాంతం చాలాకాలంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. దివిటీపల్లి అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మమత, మూడ చైర్మన్ లక్ష్మణ్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 25న రెడ్డి సేవా సమితి జిల్లా సర్వసభ్య సమావేశం:జిల్లా అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి

## రెడ్డి బాలికల వసతి గృహంలో అన్ని కులాల బాలికలకు వసతి కల్పించాం

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం):**

ఈ నెల 25వ తేదీన గద్వాలలోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో రెడ్డి సేవా సమితి జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి తెలిపారు. ఆదివారం గద్వాలలోని రెడ్డి బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2023లో ఎన్నికైన తమ కమిటీ కాలపరిమితి ముగిసిందని, కావున రాబోయే సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ప్రతి రెడ్డి నాయకుడు, సభ్యుడు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశం నిర్వహించే స్థలం, సమయాన్ని త్వరలోనే వెల్లడిస్తామన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో రెడ్లను ఒకతాటిపైకి తెచ్చేందుకు అనేక రకాల సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. రెడ్డి బాలికల వసతి గృహంలో కులమతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల బాలికలకు వసతి కల్పించి ఆదుకున్నామని తెలిపారు. రెడ్ల అభివృద్ధి కోసం అనేక ప్రణాళికలు రూపొందించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయామనే అసంతృప్తి మిగిలిపోయిందని అన్నారు.

**తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై మండిపాటు:**

రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను రెడ్డి సేవా సమితి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఒక సామాజిక వర్గాన్ని ఉద్దేశించి అసత్య ప్రచారాలు చేయడం సరికాదని, ఇప్పటికైనా మల్లన్న తన వ్యవహార శైలిని మార్చుకోవాలని హితావు పలికారు. ఈ సమావేశంలో రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, కోశాధికారి వెంకటరెడ్డి, సభ్యులు శ్రీరాంరెడ్డి, బహదూర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, గుర్రం గడ్డ శ్రీనివాసరెడ్డి, తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు



# పంటలను కాపాడుకోవడానికి రైతన్న తంటాలు

## వాటర్ ట్యాంకర్లతో కంది పంటకు సాగు నీరు

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం):**

ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, సాగు చేసిన ఆరుతడి పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి నీరు రాక ఎండిపోతుండటంతో, ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటలను తడిపే దుస్థితి దాపురించింది. జోగులాంబ గద్వాల మండలం మదనపల్లి శివారుకు చెందిన రైతు నాగిరెడ్డి తనకున్న 10 ఎకరాల పొలంలో పత్తి, కంది పంటలను సాగు చేశారు. అయితే వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే పత్తి పంట పూర్తిగా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న కంది పంటనైనా కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఆయన వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటకు పారిస్తున్నారు. ఇప్పటివరకు సాగు పెట్టుబడుల రూపంలో రూ.2 లక్షల వరకు ఖర్చు చేశానని, ఇప్పుడు పంటను బ్రతికించుకోవడానికి రోజుకు వాటర్ ట్యాంకర్లకే అదనంగా రూ.6,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఎండిపోతున్న పంటలను కాపాడటంతో పాటు నష్టపోయిన రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రెస్టారెంట్ వివాదం రచ్చకెక్కింది!

## అద్దె చెల్లింపుల వివాదంతో ఆస్తి ధ్వంసం.. రోడ్డుపై నిరసన.. పోలీసు విధులకు ఆటంకం

## రెస్టారెంట్ యజమానులు, నిర్వాహకుడిపై మాదాపూర్ పోలీసుల కేసులు

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 4, (ప్రభాత ఉదయం)**

మాదాపూర్‌లో రెస్టారెంట్ అద్దె వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అద్దె చెల్లింపుల విషయంలో తలెత్తిన వివాదం చివరకు రెస్టారెంట్ ప్రాంగణం ధ్వంసం, దారికి అడ్డంకులు, రోడ్డుపై నిరసన, పోలీసుల విధులకు ఆటంకం కలిగించే స్థాయికి చేరింది. ఈ ఘటనలకు సంబంధించి మాదాపూర్ పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాదాపూర్‌లోని పిల్లర్ నంబర్ 1723 సమీపంలో లక్కీ మల్టీకుయిజిన్ రెస్టారెంట్ను మహ్మద్ మన్సూర్ అలీ గత కొంతకాలంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంగణాన్ని రవి, హరి తదితరుల నుంచి లీజుకు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే గత కొన్ని నెలలుగా అద్దె చెల్లింపులు జరగకపోవడంతో యజమానులు, రెస్టారెంట్ నిర్వాహకుడి మధ్య వివాదం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

**జేసీబీతో ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు**

అక్టోబర్ 3న రెస్టారెంట్ సిబ్బంది అలీ ఫోన్ చేసి కొందరు వ్యక్తులు రెస్టారెంట్ ప్రాంగణాన్ని ధ్వంసం చేస్తున్నారని సమాచారం ఇవ్వడంతో మన్సూర్ అలీ తన భార్య రెహానా బేగంతో కలిసి అక్కడికి చేరుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ హరి, రవి తదితరులు కొందరు మహిళలతో కలిసి జేసీబీ సహాయంతో రెస్టారెంట్ పరిసరాలను ధ్వంసం చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ ఘటనలో పాన్‌షాప్, టీ పాయింట్, బేకరీ తదితర నిర్మాణాలకు నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా దుర్భాషలాడుతూ బెదిరించారని, కొందరు మహిళలు తన భార్య రెహానా బేగంపై దాడి చేశారని మన్సూర్ ఆరోపించారు. ఘటనను మొబైల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా తనను అడ్డుకుని ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మాదాపూర్ పోలీసులు భవన యజమానులు రవి, హరి తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసు వాహనానికి అడ్డంగా నిలబడిన లక్కీ రెస్టారెంట్ నిర్వాహకులు..

**దారిని అడ్డుకున్నారంటూ మరో కేసు**

అద్దె వివాదం నేపథ్యంలో రెస్టారెంట్‌కు వెళ్లే రహదారి రవి, హరి తదితరులు ధ్వంసం చేసి రాకపోకలకు ఆటంకం కలిగించారని మరో ఫిర్యాదు నమోదైంది. రెస్టారెంట్‌కు వెళ్లే మార్గాన్ని అడ్డుకోవడం ద్వారా వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలిగించారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపైనా మాదాపూర్ పోలీసులు మరో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

**పోలీసు వాహనానికీ అడ్డంకి**

ఇదిలా ఉండగా, అక్టోబర్ 3వ తేదీ అర్ధరాత్రి సుమారు 12.10 గంటల సమయంలో ఇండియన్ పెట్రోల్ పంప్ సమీపంలో మాదాపూర్ పెట్రోలింగ్ మొబైల్ సిబ్బంది రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా మరో ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మన్సూర్ తన భార్య, మరికొందరితో కలిసి రోడ్డుపైకి వచ్చి పోలీసు వాహనానికి అడ్డుగా కూర్చున్నారని, దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలిగాయని పోలీసులు పేర్కొన్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని కూడా అడ్డుకున్నారని తెలిపారు. ఈ ఘటనపై మన్సూర్‌తో పాటు మరికొందరిపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ సస్పెన్షన్**

మరోవైపు, లక్కీ రెస్టారెంట్‌కు సంబంధించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను సెప్టెంబర్ 26న సస్పెండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రెస్టారెంట్ తనిఖీల సందర్భంగా ఆహార భద్రత, పరిశుభ్రతకు సంబంధించిన లోపాలు గుర్తించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. అద్దె చెల్లింపుల వివాదం సంఘటనలపై మాదాపూర్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుల దర్యాప్తు పూర్తయిన తరువాత సేకరించిన ఆధారాలను బట్టి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు ప్రతీక చౌదరి ఎంపిక

**భద్రాద్రి కొత్తగూడెం(పినపాక) అక్టోబర్ 04 (ప్రభాత ఉదయం)**

పినపాక మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. ప్రతీక చౌదరి రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలకు ఎంపికైంది. 9వ తరగతి చదువుతున్న ప్రతీక చౌదరి ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 బాలికల క్రికెట్ ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు డి. వరలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రతీక చౌదరిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, పినపాక మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# మిత్రధర్మం ఎక్కడా తప్పలేదు.. తప్పేది లేదు

## శ్రీనన్న ప్రజల మనిషి.. జన నాయకుడు: బోడ రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం)**




మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కూనంనేని సాంబశివరావు 'మిత్రద్రోహం' వంటి పదాలతో విమర్శలు చేయడం రాజకీయ మర్యాద కాదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీ బోడ రమేష్ అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజకీయ జీవితంలో మిత్రధర్మాన్ని ఎక్కడా తప్పలేదని, ఇకముందు కూడా తప్పేది లేదని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం, సమస్యలతో తనను ఆశ్రయించిన వారికి స్పందించడం, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ఆయన రాజకీయ ప్రస్థానంలో భాగమని అన్నారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండే నాయకుడిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ప్రజలు చూస్తున్నారని బోడ రమేష్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఆయనను కలవాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి ఏ ప్రాంతంలో పర్యటించాలి, ఎవరిని కలవాలి, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలి అనే విషయాలను ఎవరూ నిర్దేశించలేరని బోడ రమేష్ అన్నారు. ప్రజలతో కలిసే హక్కు ప్రతి ప్రజాప్రతినిధికి ఉందని స్పష్టం చేశారు. 'కొత్తగూడెంలో రాజకీయంగా కలుగజేసుకోవద్దు' అనే తరహా వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటాయని పేర్కొన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై రాజకీయ విమర్శలు చేయాలనుకుంటే ప్రజా సమస్యలు, అభివృద్ధి, నిధులు, ప్రభుత్వ విధానాలపై ఆధారాలతో మాట్లాడాలని సూచించారు. వ్యక్తిగత పదజాలంతో విమర్శలు చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.

'మిత్రద్రోహం' అనే పదాన్ని పదేపదే ఉపయోగించడం వల్ల వాస్తవాలు మారవని బోడ రమేష్ అన్నారు. ఎవరు ఎవరికి అండగా నిలిచారు, ఎవరు ప్రజల కోసం పనిచేశారు అనే విషయం ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిత్రధర్మాన్ని ఎక్కడా తప్పలేదని, తప్పేది లేదని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలవడం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడం వంటి కార్యక్రమాలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని బోడ రమేష్ తెలిపారు. ప్రాంతీయ పరిమితులు, వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సమస్యలే రాజకీయాలకు కేంద్రబిందువుగా ఉండాలని ఆయన అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని బోడ రమేష్ కోరారు.




సూర్య ఘర్ పథకం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

# సేవా సేతు అభియాన్ - ప్రధాని సూర్యాఘర్ ముఫ్తీ బిజ్లీ యోజన పథకంతో విద్యుత్ బిల్లు ఆదా:

## రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ ఎస్ రవిప్రసాద్

**కందుకూర్, అక్టోబర్ 4(ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం తో విద్యుత్ వినియోగదారుడు కి బిల్లు ఆదా అవుతుందని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ ఎస్ రవి ప్రసాద్ అన్నారు. ఆదివారంరాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్‌లో అక్టోబర్ 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, షాద్ నగర్, కందుకూర్ విద్యుత్ డివిజన్ లలో ప్రజలకు సూర్య టి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ ఎస్ రవి ప్రసాద్ మాట్లాడుతూ... సోలార్ ప్లేట్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని ఈ పథకాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకంపై రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో 269 మంది సందర్శించి పథకం వల్ల చేకూరి ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. 57 మంది సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవటానికి ఆసక్తి కనపర్చారని అధికారులు తెలిపారు. 15 మంది ఈ పథకం కోసం నమోదు చేసుకున్న దరఖాస్తు చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు విద్యుత్ డివిజన్ డి ఈ గోపాలకృష్ణ, ఏడీఈ, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.







# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

## కూటమి సంఘాల నాయకులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భేటీ

**మణుగూరు, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం)**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ సంఘాల ఎన్నికల నేపథ్యంలో మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మూడు కార్మిక సంఘాల నాయకులతో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన కార్మిక సంఘాలైన ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ), టీఎంయూ, ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సంఘాల ఎన్నికలు, కూటమి సమన్వయం తదితర అంశాలపై ఎమ్మెల్యేతో నాయకులు చర్చించారు.

మూడు సంఘాల సమన్వయంతో ఏర్పడిన కూటమి తరఫున ఎన్నికల కార్యాచరణ, ప్రచార కార్యక్రమాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. మణుగూరు ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 241 మంది ఓటర్లు ఉన్నట్లు సంఘాల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్మికుల సమస్యలను ఐక్యంగా ప్రస్తావించడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమం కోసం సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

కూటమి ఎన్నికల సమన్వయానికి సంబంధించి పి.ఎస్. రెడ్డి, ఆర్.ఎం. రెడ్డిలు కూడా సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

సమావేశంలో ఐఎన్‌టీయూసీ డిపో కార్యదర్శి టి.ఆర్.ఎల్. చారి, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ డిపో కార్యదర్శి బి. రాములు నాయక్, ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) డిపో కార్యదర్శి తాటి సుధాకర్, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కూటమి నాయకులు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్

**మిడ్జిల్,అక్టోబర్ 4( ప్రభాత ఉదయం)**



ఎలినో నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు వికసిత్ భారత్--హామీ అజీవిక మిషన్--గ్రామీణ్ పథకం కింద నూతన జాబ్ కార్డులు జారీ చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. నూతన జాబ్ కార్డు కోసం అర్హులైన గ్రామీణ ప్రాంత కుటుంబాలు తమ గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఫీల్డ్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబంలో 18 ఏళ్లు నిండిన సభ్యులు నైపుణ్యం అవసరం లేని శారీరక పనులు చేసేందుకు సిద్ధంగా ఉండాలి. దరఖాస్తుతో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, మొబైల్ నంబర్ సమర్పించాలి. దరఖాస్తు అనంతరం అవసరమైన ఈ కేవైసీ ప్రక్రియను అధికారులు నిర్వహిస్తారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు ఏటా 125 రోజుల ఉపాధి హామీ లభించనుంది. కూలీల వేతనాలు ఆధార్ అనుసంధానిత బ్యాంక్ ఖాతాల ద్వారా జమ అవుతాయి. నూతన జాబ్ కార్డు కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.



# నదీ అగ్రహార పుష్కరఘాట్ వద్ద కలుషితమవుతున్న కృష్ణానది నీరు

## త్రాగునీటి మోటార్ల వద్దే చేపల విక్రయాలు, వ్యర్థాల పారవేత

## ఆందోళనలో భక్తులు, పట్టణ ప్రజలు.. స్పందించాలంటున్న స్థానికులు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 04(ప్రభాత ఉదయం):**

గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని నదీ అగ్రహారం వద్ద ఉన్న కృష్ణానది పుష్కరఘాట్ వద్ద పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కొంతమంది మత్స్యకారులు పుష్కరఘాట్‌పైనే చేపలను విక్రయిస్తూ, అక్కడే వాటిని కోస్తున్నారు. అనంతరం మిగిలిన చేపల వ్యర్థాలను నేరుగా నదీ నీటిలోనే పారవేస్తుండటంతో కృష్ణానది నీరు కలుషితమవుతోంది. గద్వాల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే తాగునీటి పథకానికి సంబంధించిన నీటి మోటార్లు కూడా ఇదే ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ నీరు కలుషితం కావడం వల్ల గద్వాల పట్టణ ప్రజలకు అంటురోగాలు వ్యాపించి, ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, పవిత్రమైన కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఈ దుర్వాసన, అపరిశుభ్రత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పుష్కరఘాట్ వద్ద పవిత్రత లోపించడమే కాకుండా భక్తుల భావోద్వేగాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు, మున్సిపల్ యంత్రాంగం స్పందించి పుష్కరఘాట్ వద్ద చేపల విక్రయాలను వేరే ప్రాంతానికి తరలించాలని, నదీ నీరు కలుషితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



# గిరిజన సర్పంచుల ఫోరం జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రాజేందర్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం):**

జగిత్యాల జిల్లా గిరిజన సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఫోరం జిల్లా అధ్యక్షుడిగా గుగులావత్ రాజేందర్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోత్ వినోద్ నాయక్, ఉపాధ్యక్షుడిగా భూక్య తిరుపతి నాయక్, ప్రధాన కార్యదర్శులుగా బానోత్ రమేష్ నాయక్, పరచ శంకర్ ఎంపికయ్యారు. కార్యదర్శులుగా మాలోత్ తిరుపతి, బోడ సాగర్, కోశాధికారిగా రామ్ చందర్, సుధాకర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యవర్గ సభ్యులుగా గణేష్ నాయక్, అపోవత్ రాజు, సురేందర్ నాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన సర్పంచుల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారం, సర్పంచుల హక్కులు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.




# కూకట్‌పల్లిలో యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

## యువతే కాంగ్రెస్ కు ప్రధాన బలం - బండి రమేష్

**కూకట్ పల్లి , అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గా భవన్ లో కూకట్ పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కూకట్ పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. సలీం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మరియు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువతే ప్రధాన బలమని, కూకట్ పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేయాలని అన్నారు. యువత ప్రజా సమస్యలపై ముందుండి పోరాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి విభాగంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కూకట్ పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ కార్యకలాపాల బలోపేతం, రాబోయే కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ భవ్య, జిల్లా ఇంచార్జ్ లు మున్నీర్ అహ్మద్, నాగార్జున, జిల్లా అధ్యక్షుడు బొమ్మక్క అజయ్, రాష్ట్ర కార్యదర్శి రమ్య తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608